క్లుప్తంగా

రథసప్తమికి ఏర్పాట్లు పూర్తి



సూర్యనారాయణ స్వామి ఆలయం

సరుబుజ్జిలి: రెండో అరసవల్లిగా ప్రసిద్ధి చెందిన పురుషోత్తపురం సూర్యనారాయణస్వామి ఆలయంలో సోమవారం నిర్వహించనున్న రథసప్తమి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అర్చకులు బంకుపల్లి వెంకటసత్యగోపాలరావు ఆదివారం తెలిపారు. స్వామివారి నిజరూపదర్శనం, క్షీరాభిషేకాలు, సూర్య నమస్కారాలు, హోమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు వెల్లడించారు. ఈ ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

అబాకస్ పోటీల్లో ప్రతిభ



దక్షితకు సర్టిఫికెట్, మెమెంటో అందజేస్తున్న నిర్వాహకులు

నరసన్నపేట: జిల్లా స్థాయి స్టార్ జూనియర్ అబాకస్ పోటీ పరీక్షలో నరసన్నపేటకు చెందిన గొబ్బక దక్షిత మొదటి స్థానంలో నిలిచారు. జిల్లా కేంద్రంలోని వికాస్ స్కూల్లో ఆదివారం జిల్లా స్థాయి అబాకస్ పోటీలు హైదారాబాద్‌కు చెందిన విశ్వం ఎడ్యుటెక్ నిర్వహించింది. నరసన్నపేటలోని విద్యార్థి భవన్ స్కూల్‌కు చెందిన దక్షిత ప్రతిభ చూపింది. దక్షితకు స్కూల్ డైరెక్టర్ గోవిందబాబుతోపాటు పలువురు ఆదివారం అభినందించారు. ఈ పోటీల్లో 30 స్కూళ్ల నుంచి 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

సనాతన ధర్మం గొప్పది



సత్సంగంలో పాల్గొన్న ఆధ్యాత్మిక ప్రచనకర్తలు

సారవకోట: సనాతన ధర్మం గొప్పదని దేవీ ఉపాసకులు రవిచంద్ర స్వామి అన్నారు. ఆదివారం మండలంలోని కిన్నెరవాడ గ్రామంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 55వ కల్యాణ మహోత్సవం పురస్కరించుకుని ఆధ్యాత్మిక సత్సంగం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్ర స్వామి కాలజ్ఞానం మానవాళికి భవిష్యత్ గుర్చి తెలియజేస్తుందన్నారు. ఉత్తరాంధ్ర సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద స్వామి మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బోయిన వెంకటరమణ, గొలివి మోహన్‌రావు, అల్లు రామయ్య, తదితరులు పలు ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు.

వైఎస్సార్‌సీపీ నాయకురాలి మృతికి సంతాపం



ధర్మాన జయలక్ష్మమ్మ (ఫైల్)

జలుమూరు: సైరిగాం పంచాయతీ పరిధి లింగన్నాయుడుపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకురాలు ధర్మాన జయలక్ష్మమ్మ అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఈమె కోడలు అనిత సైరిగాం సర్పంచ్‌గా పని చేస్తున్నారు. కుమారుడు జగన్ వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌గా ఉన్నారు. ఈమె మృతి పట్ల మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ సంతాపం వ్యక్తం చేశారు. ఎంపీపీ వాన గోపి, మాజీ ఎంపీపీ బగ్గు రామకృష్ణ, అల్లాడ, చల్లవానిపేట పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు పి.ముసలినాయుడు, రాజప్పల నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, పైడి విఠల్‌రావు, వెలమల అసిరినాయుడు తదితరులు పరామర్శించారు.

సిరుసువాడ మాజీ సర్పంచ్ మృతి



నరసమ్మ పాత్రో (ఫైల్)

కొత్తూరు: మండలంలోని సిరుసువాడ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకురాలు నరసమ్మ పాత్రో (70) ఇంటి వద్ద ఆదివారం అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సిరుసువాడ సర్పంచ్‌గా 2013 నుంచి 2019 వరకు పనిచేశారు. నరసమ్మ పాత్రో భర్త ఇదివరకే మృతి చెందారు. ఈమెకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈమె కుమారుడు అర్జున్ పాత్రో వైఎస్సార్‌సీపీ నాయకుడిగా పార్టీకి సేవలు అందిస్తున్నారు.

నేడు సామూహిక అక్షరాభ్యాసం

పాతపట్నం: స్థానిక ఆల్ ఆంధ్రా రోడ్డు సమీపంలోని షిర్డీ గిరిపై ఉన్న సాయిబాబా మందిరంలో సోమవారం సరస్వతీ పూజ, సాముహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు బాబా కమిటీ సభ్యుడు తారకేశ్వరరావు ఆదివారం తెలిపారు. సాయిబాబా సేవా సంఘం ఆధ్వర్యంలో ఉదయం 7 గంటల నుంచి ఈ కార్యక్రమాలు ఉంటాయన్నారు. సరస్వతీదేవి పూజకు వచ్చే భక్తులు పూజా సామగ్రి తీసుకురావాలని కోరారు.

షట్టర్లను బాగుచేసేది ఎప్పుడు?

- ప్రతీ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగునీటి అవస్థలు
- తుప్పుపట్టిన షట్టర్లు
- ఎగువ భూములకు నీరు అందక ఇబ్బందులు
- అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని రైతుల విజ్ఞప్తి



పోలాకి ఓపెన్ హెడ్ చానల్‌పై బద్దవానిపేట వద్ద శిథిలమైన షట్టర్లు



బాడాం వద్ద వంశధార పిల్ల కాలువపై అధ్వానంగా ఉన్న షట్టర్



రెళ్లివలస వద్ద వంశధార చానల్‌పై తప్పపట్టిన షట్టర్

నరసన్నపేట: సాగునీటి సరఫరాలో అత్యంత కీలకమైన షట్టర్లను ఏళ్ల తరబడి మరమ్మతులు చేయకపోవడంతో రైతులు ఏటా ఖరీఫ్ సీజన్‌లో సాగునీటికి అవస్థలు పడుతున్నారు. సాగునీటిని ఎగువ భూములకు తరలించాలన్నా.. కింద భూములకు సక్రమంగా అందించాలన్నా షట్టర్లు అవసరం. నరసన్నపేట నియోజకవర్గంలో పదేళ్లకు పైగా సాగునీటి కాలువలపై ఉన్న షట్టర్లు సక్రమంగా పనిచేయడం లేదు. వంశధార మెయిన్ చానల్ (ఎన్‌బీసీ) వంటి కాలువలపై అత్యవసర రీత్యా కొన్నింటిని బాగుచేసి నీటిని రెగ్యులర్ చేస్తున్నారు. చిన్న కాలువలపై ఉన్న షట్టర్లు మాత్రం పూర్తిగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఏటా ఖరీఫ్‌కు ముందు రాజకీయ నాయకులు అధికారులతో సంప్రదింపులు చేస్తున్నారే తప్ప.. వాటిని ఎలా మరమ్మతులు చేయాలి అనే ఆలోచన చేయడం లేదు.

నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట మండలాల్లో వందలాది షట్టర్లు తుప్పుపట్టాయి. నరసన్నపేట మండలంలో పోలాకి, మబగాం ఓపెన్ హెడ్ చానల్, వంశధార పరిధిలో ఉన్న 3-ఆర్ నడగాం, సెవెన్ ఆర్ ఉర్లాం, లెవెన్ ఆర్ కిళ్లాం, 8-ఆర్ దేవాది, 10-ఆర్ గొట్టిపల్లి, మేఘవరం వంటి ప్రధాన చానళ్లున్నాయి. వీటికి ఆనుకొని పిల్ల కాలువలు పదుల సంఖ్యలో ఉన్నాయి. ఈ చానళ్లలో నీటి రెగ్యులేషన్ కోసం ఏటా షట్టర్లను మరమ్మతులు చేస్తుండాలి. అలాంటిది పదేళ్లకు పైగా షట్టర్లను ముట్టుకోలేదు. కోర్టులో కేసులు ఉన్నాయనే నెపంతో సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు. రానున్న ఖరీఫ్‌కు అయినా షట్టర్లను బాగుచేయాలని రైతులు కోరుతున్నారు. ఖరీఫ్ ముందు హడావిడి చేయకుండా ఇప్పటినుంచే తగిన చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

షట్టర్లను బాగుచేయాలి



సాగు నీరు పొలాలకు సక్రమంగా అందాలంటే షట్టర్లు ఎంతో ప్రధానం. వీటిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దాదాపు 15 ఏళ్ల నుంచి మరమ్మతులు జరగడం లేదు. రైతులు కోరుతుంటే సీబీడీ కేసు ఉంది తాము ఏమీ చేయలేమని ఇంజినీర్లు తప్పించుకుంటున్నారు. ఎన్నాళ్లు ఇలా కాలక్షేపం చేస్తారు.

– కనుపల శేఖరరావు, కోమర్తి నీటి సంఘం మాజీ అధ్యక్షుడు, పోతయ్యవలస, నరసన్నపేట

తగిన చర్యలు తీసుకోవాలి



సాగునీటి సరఫరాలో ఏటా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి ప్రధాన కారణం కాలువల్లో నీటి రెగ్యులేషన్ సక్రమంగా జరగకపోవడమే. నీటి రెగ్యులేషన్ జరగాలంటే షట్టర్లు సక్రమంగా పనిచేయాలి. వాటిని పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా వంశధార ఇంజినీర్లు, ప్రజాప్రతినిధులు తగిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం దృష్టికి సమస్య తీవ్రతను తీసుకువెళ్లి పరిష్కరించాలి.

– ధర్మాన జగన్, పర్లాం డిస్ట్రిబ్యూటరీ మాజీ చైర్మన్, లింగన్నాయుడుపేట, జలుమూరు

కోర్టులో కేసులున్నాయి

షట్టర్లు మరమ్మతులు కావడం లేదనే విషయం మాకూ బాధగానే ఉంది. దీంతో నీటి రెగ్యులేషన్ చాలా కష్టంగా మారింది. షట్టర్లు మరమ్మతులు చేయలేని పరిస్థితిలో ఉన్నాం. సీబీడీలో ఉన్న కేసు పరిష్కారం కాకపోతే ఏమీ చేయలేం. సమస్య తీవ్రతను ఎప్పటికప్పుడు అధికారులు దృష్టికి తీసుకువెళ్తున్నాం.

– ప్రదీప్ కుమార్, ఈఈ, వంశధార మెయింటెనెన్స్ డివిజన్, నరసన్నపేట

పవర్ ప్లాంట్ వద్దు.. పర్యావరణం ముద్దు



మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

- గిరిజన సంఘాల నాయకుల డిమాండ్
- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఆధ్వర్యంలో సమావేశం

బూర్జ: పవర్ ప్లాంట్ నిర్మించి పర్యావరణానికి హాని తల పెట్టవద్దని గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ముక్త కంఠంతో ఆదివాసీలు వ్యతిరేకించారు. జంగాలపాడు గిరిజన గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ కోసం గిరిజనులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ గిరిజనుల అభిప్రాయం మేరకు వారికి నష్టం కలిగే క్రిటికల్ సూపర్ జెన్‌కో విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు వైఎస్సార్‌సీపీ కట్టుబడి ఉంటుందన్నారు. సరుబుజ్జిలి, బూర్జ మండలాల్లో నిర్మాణం చేపట్టబోయే ప్లాంట్‌కు సమారు 1,500 ఎకరాలు అవసరం అంటుందన్నారు. ఆదివాసీలు ప్రస్తుతం పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ గిరిజనుల మనోభావాలు తెలుసుకుని అన్ని శాఖల అధికారులతో చర్చించి ఈ విషయాలను వివరించాలన్నారు. సీఎం చంద్రబాబుకు పేదలు, గిరిజనుల అంటే ఎందుకంత చిన్నచూపని ప్రశ్నించారు. ఈ సమావేశానికి బొడ్లపాడు, జంగాలపాడు, అద్దూరిపేట, గోపిదేవిపేట, సోమిదలవలస, బూర్జమానుగూడ, చిన్నచలంతోపాటు పలు గిరిజన గ్రామాల ప్రజలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బూర్జ, సరుబుజ్జిలి జెడ్పీటీసీ సభ్యులు బెజ్జిపురపు రామారావు, సురవరపు నాగేశ్వరరావు, బూర్జ, సరుబుజ్జిలి మండలాల పార్టీ అధ్యక్షులు ఖండాపు గోవిందరావు, బెవర మల్లేశ్వరరావు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సవర సురేష్ దొర, వైస్ ఎంపీపీ కరణం కృష్ణంనాయుడు, నాయకులు కర్నేన నాగేశ్వరరావు, బొడ్డేపల్లి నాగరాజు, పున్నపురెడ్డి తవిటినాయుడు, ఎడ్ల ఈశ్వరరావు, ఏగు రాజారావు, తొత్తడి సురేష్, అత్తులూరి రవికాంత్, ఇల్లాకుల సూర్యప్రకాష్, కె.గౌరినాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వీటికి ఎన్నికల కోడ్ వర్తించదా?



హిరమండలం: సుభలయ రైస్ మిల్లు గోడకు ఉన్న కూటమి నేతల ఫ్లెక్సీ

హిరమండలం: మండలంలోని సుభలయ వద్ద ఉన్న రైస్ మిల్లు గోడకు కూటమి నాయకులకు చెందిన ఫ్లెక్సీని ఆదివారం నాటికి కూడా తొలంగిచలేదు. దీనికి ఎన్నికల కోడ్ వర్తించదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అధికారులు హిరమండలం మండల కేంద్రంలో మాత్రమే నాయకుల విగ్రహాలకు ముసుగులు వేసి, ఫ్లెక్సీలను తొలగించారు. సుభలయ, గొట్టాబ్యారేజీపై ఉన్న ఫ్లెక్సీలను ఇంకా తొలగించలేదు.



పాతపట్నం: బూరగాం పరిధిలోని జాతీయ రహదారి పక్కన ఉన్న ఫ్లెక్సీ

బూరగాంలో..

పాతపట్నం: ఎన్నికల నియమావళి ప్రస్తుతం జిల్లాలో అమలులో ఉన్నా.. మండలంలోని పలు గ్రామాల్లో కూటమి నాయకుల ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. మండల కేంద్రంలోని కొన్ని ఫ్లెక్సీలను పేరుకే తొలగించారు తప్ప.. అవి తొలగించిన చోట వదిలారు. పలుచోట్ల పూర్తిస్థాయిలో ఫ్లెక్సీలను తొలగించకుండా సగం కప్పి ఉంచారు. మండలంలోని పలు గ్రామాల్లో అధికార పార్టీ నాయకుల ఫ్లెక్సీలు అలాగే ఉంచారు. బూరగం పరిధిలోని జాతీయ రహదారి పక్కన ఆదివారం కూడా కూటమి నాయకుల ఫ్లెక్సీలు అలాగే ఉన్నాయి.

ఫ్లెక్సీల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్

సారవకోట: ఎన్నికల కోడ్ అములులో ఉన్నా.. పలు గ్రామాల్లోని అధికార పార్టీ నాయకుల ఫ్లెక్సీలు తొలగించకపోవడంతో ఆదివారం సాక్షిలో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎంపీడీఓ మోహన్‌కుమార్ తర్లితోపాటు పలు గ్రామాల్లోని ఫ్లెక్సీలు, బ్యానర్‌లు తొలగించాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో ఉన్న ఫ్లెక్సీలను తొలగించారు.



తర్లి గ్రామానికి వెళ్లే మార్గంలో ఫ్లెక్సీని తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



సీఐ శ్రీనివాసరావు

నరసన్నపేట: రథసప్తమి సందర్భంగా అరసవల్లి సూర్యనారాయణ స్వామి దర్శనానికి టెక్కలి, నరసన్నపేట వైపు నుంచి వచ్చేవారు శ్రీకాకుళం పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా నింధనలు పాటించాలని నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు సూచించారు. ఆటో, కార్లు, క్యాబ్‌లు, ప్రత్యేక బస్సులు, ఇతర వాహనదారులు జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న మారుతీ సుజుకీ ఏరీనా ఎదురుగా ఉన్న రోడ్డు నుంచి శాస్త్రులపేట, సానివాడ మీదుగా ఒప్పంగి చేరుకొని అక్కడి నుంచి వాడాడ మీదుగా అరసవల్లి వెళ్లాలన్నారు. శ్రీకాకుళంలో వాహనాల రద్దీని నివారించడానికి ఈ విధంగా వాహనాలను మళ్లిస్తున్నట్లు తెలిపారు.

ఫీజు పోరు విజయవంతం చేయండి



శిమ్మ సాంబశివరావు

ఎల్.ఎన్.పేట: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు ఈ నెల 5వ తేదీన చేపట్టనున్న ఫీజు పోరు ఆందోళన కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యం కావాలని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, మాజీ ఎంపీపీ శిమ్మ సాంబశివరావు ఆదివారం పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో జరిగే ఫీజుపోరు కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతున్నా ఫీజులు చెల్లించకపోవటం అన్యాయమన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు చెల్లించాల్సి వస్తుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమల్లో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

పొందూరు: పాత కేసులు రాజీకి వచ్చే క్రమంలో ఖాజీపేటలో ఇరు కుటుంబాలకు చెందిన వారు ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడంతో ఇరువర్గాలపై హత్యాప్రయత్నం కింద కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఉదయం కంచె రాము, కంచె పోలోడు మరికొంత మంది కలిసి పల్ల రాజు ఇంటికి వెళ్లి ఆయన భార్య రోజాపై దాడి చేశారు. రోజా ఇంటి బయటకు వచ్చి కేకలు వేసింది. ఆ సమయంలో వీధిలో నుంచి కంచె సీతారాం వెళ్తుండగా.. పల్ల గంగాధర్ మరో పది మంది దాడి చేశారు. ఇరువర్గాల వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ చెప్పారు.

చిత్తడి నేలలను సంరక్షించుకోవాలి



అవగాహన ర్యాలీలో పాల్గొన్న కుమారస్వామి, ఉపాధ్యాయులు

పాతపట్నం: ప్రతి ఒక్కరూ చిత్తడి నేలలను (భూమి) సంరక్షించుకోవాలని జిల్లా సైన్స్ అధికారి నల్ల కుమారస్వామి అన్నారు. ఆదివారం ప్రపంచ చిత్తడి నేలల సంరక్షణ దినం సందర్భంగా పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీల భుములు భూగర్భ జలాలను కాపాడుతాయన్నారు. చిత్తడి నేలలు ఆహార భద్రత, ఆరోగ్య భద్రత, ఉపాధిని కల్పిస్తాయన్నారు. మన రాష్ట్రంలోని సోంపేట, వడ్డితాండ్ర, కొల్లేరు సరస్సులు బీల భూముల పరిధిలోకి వస్తాయని, వాటిని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సనపల వైకుంఠరావు, సైన్స్ ఉపాధ్యాయుడు రామారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుపయోగం..



సారవకోట మండలంలోని రామకృష్ణాపురం పంచాయతీ కేంద్రంలో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిరుపయోగంగా ఉంది. గ్రామంలోని చెత్త సేకరించి ఈ కేంద్రానికి తరలించి సేంద్రీయ ఎరువులు తయారు చేసేందుకు ఏర్పాటు చేశారు. నిర్మాణం చేపట్టిన నాటినుంచి నేటివరకు ఒకటి, రెండుసార్లే వినియోగించారు. చెత్త నింపే తొట్టేలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి.

– సారవకోట

భక్తిశ్రద్ధలతో..



నరసన్నపేట మండలంలోని పెద్ద బొరిగివలసలో గల ఉమాసహిత మల్లేశ్వరస్వామి ఆలయ 12వ వార్షికోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి గ్రామస్తులతోపాటు పరిసర గ్రామాల ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామి వారి కల్యాణం వైభవంగా చేపట్టారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పొందర కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజాపు అప్పన్న, ఎల్‌వీఆర్ కళాశాల డైరెక్టర్ స్వరూప్, తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో అరటి గెలలు కట్టి మొక్కులు తీర్చుకున్నారు.

– నరసన్నపేట

వైభవంగా ఆలయ ప్రతిష్ఠ



కొత్తూరు మండలంలోని పొన్నుటూరు కాలనీలో కోదండరామాలయ ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా నిర్వహించారు. జనవరి 31 నుంచి ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభించారు. చివరి రోజు ఆలయం శిఖరం మీద నుంచి వేసిన బూరెల ఘటన ఆకట్టుకుంది. బూరెల కోసం భక్తులు పోటీపడ్డారు. భక్తులు విశేష, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు. పొన్నటూరు సర్పంచ్ చామంతి, ప్రజాప్రతినిధులు, ఆలయ నిర్మాణ దాతలు పాల్గొన్నారు.

– కొత్తూరు

పదిలో శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేక తరగతిని పరిశీలిస్తున్న ఎంఈఓ

నరసన్నపేట: మండలంలో 13 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి 630 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరవుతున్నారని, శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నామని ఎంఈఓ శాంతారావు తెలిపారు. ఆదివారం పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత, జెడ్పీహెచ్ బాలికలు, జెడ్పీహెచ్ (బోర్డు) స్కూళ్లల్లో తరగతుల నిర్వహణ తీరును పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులపై అధికంగా ఒత్తిడి కల్పించవద్దన్నారు. విద్యా ప్రమాణాల మేరకు గ్రేడ్లుగా విభజించి క్లాసులు నిర్వహించాలన్నారు. ఈ ఆదివారం నుంచి ప్రత్యేక తరగతులకు వస్తున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ప్రత్యేక తరగతులను వినియోగించుకోవాలన్నారు. తల్లిదండ్రులు కూడా బాధ్యతగా వ్యవహరించి ఇంట్లో చదివించాలన్నారు.

ప్రత్యేక తరగతులతో ఉత్తమ ఫలితాలు


జలుమూరు: ప్రత్యేక తరగతుల నిర్వహణతో ఉత్తమ ఫలితాలు సాధించడం జరుగుతుందని ఎంఈఓలు బి.మాధవరావు, ఆర్‌వీఎస్ ప్రసాద్ అన్నారు. ఆదివారం జలుమూరు, లింగాలవలస, పెద్దదూగం, కరవంజ, శ్రీముఖలింగం తదితర ఉన్నత పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహించారు. వీటిని ఎంఈఓలు పరిశీలించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

సంక్షిప్తంగా..

టీడీపీ ఎంపీటీసీపై ఫోర్జరీ కేసు

కొత్తూరు: కొత్తూరు మండలం కడుము ఎంపీటీసీ సభ్యుడు వలురౌతు గోవిందరావు, కడుము వీర్వో, రాజగోపాలరావు, పంచాయతీ కార్యదర్శి ఉమారాణిలు సంతకాలను ఫోర్జరీ చేయడంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎండీ అమీర్ ఆలీ తెలిపారు. కడుము రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబర్ 28-6 లో 8 సెంట్లు, 37-2లో 3 సెంట్లు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని జీడిపిక్కలు, వాటర్ ప్లాట్‌లను నిర్మించారు. గోవిందరావు అక్రమించిన స్థలం పై జిల్లా కలెక్టర్‌కు పలువురు ఫిర్యాదు చేశారు. అయితే ఈ భూమిని కొనుగోలు చేసేందుకు గాను వీర్వో, పంచాయతీ కార్యదర్శిల రబ్బరు స్టాంప్‌లు తయారు చేసి ఇద్దరు సంతకాలను గోవిందరావు ఫోర్జరీ చేసి హిరమండలం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాడు. సంతకాలపై అనుమానం వచ్చిన సబ్ రిజిస్ట్రార్ వీఆర్వో, పంచాయతీ కార్యదర్శిలకు ఫోన్‌లు చేశారు. సంతకాలు తమవి కావని వారు తెలిపారు. ఈ విషయంపై వీఆర్వో, పంచాయతీ కార్యదర్శులు తహసీల్దార్ రవిచంద్రకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు తహసీల్దార్ రవిచంద్ర ఎస్‌ఐకు ఫిర్యాదు చేయడంతో ఎంపీటీసీ గోవిందరావుపై కేసు నమోదు చేశారు.

నేడు పాదాలమ్మ ఆలయ వార్షికోత్సవం



నరసన్నపేట: మండలంలోని సత్యవరాగ్రహారంలోని పాదాలమ్మ తల్లి (చరణాంబిక) ఆలయ నాలుగో వార్షికోత్సవం సోమవారం నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధులు, ఎంపీపీ ఆరంగి మురళి ఆదివారం తెలిపారు. మాఘ శుద్ధ పంచమి సందర్భంగా వార్షికోత్సవం నిర్వహించనున్నారు. అమ్మవారి మూల విరాట్‌కు, పాదాలకు అభిషేకం, ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. మహిళలు ముగ్రాటలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రకటించింది. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

బోరు బాగుచేశారు..

కొత్తూరు: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో బోరును ఆదివారం బాగుచేసినట్లు సర్పంచ్ పడాల కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పడాల లక్ష్మణరావు తెలిపారు. కాలనీ వాసులకు తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి



వీఆర్‌ఏ లక్ష్మణరావు (ఫైల్)

నరసన్నపేట: మండలంలోని చెన్నాపురంలో వీఆర్ఏగా పని చేస్తున్న దుండంగి లక్ష్మణరావు (48) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందినట్లు భార్య లక్ష్మి తెలిపారు. ఈయన మృతికి తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్ఐ సాయి, రెవెన్యూ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. వీఆర్ఏకి కుమారుడు సింహాచలం ఉన్నారు.

ముమ్మరంగా కాలువలు నిర్మాణం



సిమెంట్ కాలువ పనులు చేపడుతున్న దృశ్యం

కొత్తూరు: మండల కేంద్రంలోని ఎస్.ఎస్.కాలనీతో పాటు కొత్తూరులో సిమెంట్ కాలువల పనులు ఆదివారం చేపట్టారు. సర్పంచ్ పడాల కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పడాల లక్ష్మణరావు పర్యవేక్షించారు.